Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

**లీగల్ కౌన్సెలింగ్**

# ఆ డబ్బు తిరిగి వస్తుందా?

*1992లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అకౌంట్ ప్రారంభించాను. ఆ అకౌంట్ 1993 వరకు కొనసాగింది. అకౌంట్ కొనసాగుతున్న సమయంలోనే నా బ్యాంక్ పాస్‌బుక్ పోయింది. కొత్త అకౌంట్ బుక్ గురించి అనేకసార్లు అడిగి విసిగిపోయాను. చివరికి బ్యాంక్ వారి సూచన మేరకే మరో కొత్త అకౌంట్ ప్రారంభించి ఇప్పటిదాకా కొనసాగిస్తున్నా. అయితే ఈ మధ్యన అంటే 2018లో మేము ఇల్లు ఖాళీ చేసి మరో ఇంటికి మారుతున్న సమయంలో పాత అకౌంట్ బుక్ దొరికింది. అందులో ఎనిమిది వేల రూపాయలు బ్యాలెన్స్ ఉన్నట్లు ఉంది. వెంటనే అకౌంట్ బుక్ తీసుకుని బ్యాంక్‌కు వెళితే, లావాదేవీలన్నీ కంప్యూటరైజ్ చేశామని, అందువల్ల మీ తాలూకు అకౌంట్స్ మా వద్ద లేవని, మేమేమీ చేయలేమని చెప్పారు. నా పాత అకౌంట్‌లో ఉన్న డబ్బు నాకు వచ్చే మార్గమే లేదా? ఉంటే ఆ మార్గమేమిటో వివరించండి.*

**- డి. రాజశేఖర్,** కృష్ణాజిల్లా

**బ్యాంక్** నియమావళి ప్రకారం ఖాతాదారుడు తన పాస్‌బుక్‌ను కోల్పోయినప్పుడు, తన వద్ద ఉన్న ఇతర ఆధారాలతో సదరు ఖాతా తనదిగా నిరూపించవలసి ఉంటుంది. ఆ తర్వాత డూప్లికేట్ పాస్‌బుక్ ఇవ్వమని బ్యాంక్‌వారిని అడుగుతూ, దానికి సంబంధించిన డబ్బులు చెల్లించాలి. దాంతో బ్యాంక్ వారు విధిగా మీకు డూప్లికేట్ పాస్‌బుక్ ఇస్తారు. మీ విషయంలో మాత్రం బ్యాంక్ వారు కొత్త పాస్‌బుక్ ఇవ్వకుండా విసిగించారని, చివరికి వారి సలహా మేరకే కొత్త అకౌంట్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. వాస్తవానికి పాస్‌బుక్ పోయినప్పటికీ అకౌంట్‌లో ఉన్న బ్యాలెన్స్‌ను పొందే అర్హత ఖాతాదారుడికి ఉంటుంది. కేవలం మీ వద్ద పాస్‌బుక్ లేదన్న కారణంతో బ్యాంక్ వారు మీ డబ్బు చెల్లించకపోవడం అనేది చట్ట విరుద్ధం. మీరు పోగొట్టుకున్న పాస్‌బుక్ దొరికిన తరువాతయినా, అందులో పేర్కొన్న బ్యాలెన్స్ డబ్బు ఇవ్వమని కోరగానే ఇవ్వాలి. కానీ, కంప్యూటరైజ్ చేశామని, అందువల్ల మీ అకౌంట్స్ లేవని బ్యాంక్‌వారు తెలిపినట్లుగా మీరు రాశారు. బ్యాంక్ వారు మీకు డబ్బు చెల్లించలేకపోవడానికి చూపిన కారణాలు ఎంతమాత్రం సహేతుకం కావు. చట్టపరంగా అవి ఏవిధంగానూ చెల్లవు. బ్యాంక్‌లో ఉన్న ఖాతాదారుని డబ్బు, ఎక్కువ కాలం గడిచిపోయిందన్న కారణంగా చెల్లించకుండా ఉండిపోయే ఆస్కారం ఎంతమాత్రం లేదు. ఖాతాదారుని డబ్బులు ఖాతాలో ఉన్నట్లయితే, బ్యాంకింగ్ చట్టాల ప్రకారం విధిగా ఆ డబ్బును వడ్డీతో సహా చెల్లించవలసి ఉంటుంది. కాకపోతే ఏ ఖాతాదారుడైనా తన ఖాతాను ఎక్కువ కాలం పాటు ఉపయోగించనప్పుడు ఆ ఖాతాను మూసివేసే అధికారం బ్యాంకుకు ఉంటుంది. అంతే తప్ప ఆ ఖాతా లేదని చెప్పడానికి వీలులేదు. అందువల్ల మీ ఇబ్బందులను హైదరాబాద్‌లోని రిజర్వ్‌బ్యాంక్‌కు చెందిన బ్యాంకింగ్ అంబుడ్స్‌మ్యాన్‌కు ఫిర్యాదు చేయండి. లేదా మీకు దగ్గరలో ఉన్న జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయండి. ఈ రెండింటిలో మీకు సౌలభ్యంగా ఉన్న ఏదో ఒక విధానాన్ని ఎన్నుకుని, అవసరమైన చర్యలు తీసుకుంటే న్యాయం జరుగుతుంది. అలాచేస్తే, మీ అకౌంట్‌లో ఉన్న డబ్బును వడ్డీతో సహ రాబట్టుకోవడంతో పాటు మీకు కలిగిన మానసిక క్షోభకు, ఇతర ఖర్చులను కూడా పొందడానికి వీలుంటుంది.





**- టి. ఎల్.నయన్ కుమార్**
న్యాయవాది, హైదరాబాద్